# అబ్బాయి-నాన్న

కథా నిలయం
3668
శ్రీకాకుళం

"చెప్పండి....మరి!"

"ఏమిటి?"

"చందమామను....చంద్రుణ్ణీ, మామ అని ఎందుకు పిలవడం?"

"ఏమో"

"ఓస్....ఇంతేనా...."

"ఐతే, చెప్పనా...."

"ఆఁ...."

"నీవు ఒప్పుకుంటావా?"

"ముందు చెప్పండి. గెలువలేక...."

"నీలాటి చక్కని చుక్కలు కూతుళ్ళుండటంచేత...."

"సంతోషించారు తెలివికి, తమరెవరో అప్పుడు?"

"మేం లక్ష్మీపుత్రులం!"

"ఓహో....అదా సంగతి! రోజూ తోటలో పూలన్నీ మాయమౌతుంటే.... ఏమైపోతున్నాయా అనుకుంటున్నా. ఎవరిమీద ప్రయోగించడానికేం బాణసంచాంతా?"

"అది కాదండి....నాకు తెలుసులే....దేవిగారికి తల జారి, దండలు అమరటం లేదని గునుపు"

"పోనీ తీసుకోండి మీ క్రాపింగు....లో....కి...."

"నవ్వు....అలాగే....నవ్వితే నే నూరుకోను...."

"ఐతే కోపం తెప్పించుకుంటా....ఇదుగో, బుంగమూతి పెడుతున్నా....వచ్చేసింది....ఊహుఁ...."

"ఇదుగో!....ఓయ్! ...ఊ!....పలకవూ? ఏమిటి నిజంగా కోపం వచ్చినట్లేనా? ఊహుఁ! అలా అయితే నేను ఒప్పుకోను. అన్నింటికీ ఓమాదిరిగానే తల ఊగిస్తే

ఎలా? కోపం రాలేదా? వచ్చిందా? వచ్చిందీ? సై....ఇక కాచుకో, చక్కిలిగింత పెట్టనా—నవ్వకూడదు—ఏం....సరేనా?"

* * *

"ఏమిటా కిచకిచలు? ఇంకా మేలుకునే ఉన్నార్రా?"

"............"

"వినబడుతూనే ఉందిలే నవ్వు. మీరు మాట్లాడకపోయినా—"

"ఇక చాలించండి, ప్రొద్దుపోయింది. అమ్మాయి! ఇక పడుకో అమ్మా! ఓపలేని పిల్లవు. ఒళ్ళు భారకిస్తుంది. వాడికేంలే ? అలవాటేగా తెల్లవార్లూ మేలుకోవడం!"

◆ ◆ ◆

"చెపుతే విన నేర్పులే దేంచేతునమ్మా? వాడు వాడే; అది అదే....ఇదుగో నర్రా! ఇక నే నూరుకోను."

"....మరే....అమ్మమ్మా...."

"కాదండీ....అమ్మమ్మగారూ....ఈయనే...."

"చూడవే....న....వ్వి....స్తూం....ది....నే....ను...."

◆ ◆ ◆

"మీ యిష్టం మీది సేయనా....ఉండండి, మెట్ల గదిలోకి వెళ్ళి పెద్దమీట వేసేస్తా....దీపాలున్నంతవరకూ—"

◆ ◆ ◆

"అమ్మమ్మా! వెన్నెల్లో నీ మనుమరాలే...."

"ఊఁ అఘోరించండి....మీ యిల్లు బంగారంగానూ"

## 2

"చూడండి ..."

—మిమ్మల్నే...."

—అక్కడ కాదు—ఇలా రండి...."

—అబ్బ! రండి....ఇంతలో మరేం అరిగిపోరు...."

—ఓ! పిలిచినకొద్దీ బిగింపు ఎక్కువౌతూందేం? మిమ్మల్ని ఎవరూ కొరుక్కు తినరులెండి—రద్దురూ...."

"ఎందుకూ?"

"....ఆలా చూడరేం, పాప పిలుస్తున్నాడు...."

"ఆ....నీ అంతవాడే....తక్కువా ఏం?"

"కాదండీ....మీ అంతవాడు. మీ గుణాలన్నీ అప్పుడే అబ్బినాయ్. అనుక్షణం అనుసరించి ఉండాలికద....ఓస్!....లేదమ్మ....మా నాన్న! మా బంగారు తండ్రి! నిన్ను కాదమ్మ! అబ్బ! ఎంత రోష మొచ్చిందో! ఒక్కమారు తీసుకోండి. ఎలా చేతులు చాస్తున్నాడో...."

—కే. అ. వు....కే....వు....కే....వుం....గా అ....

"పోనీలెండి....తెలియదంలా? వాడి భాషలో నన్నెత్తుకోవూ?....అని ఎలా పిలుస్తున్నాడో...."

"....ఇంతమాత్రం కవిత్వం నాకూ చేతనవును. నీవు పనికిరావు....అమ్మవు కావు....అంటున్నాడు, సరేనా...."

"మహా నేర్చారులెండి మాటలు...."

"మాట...."

"............"

"పాపని....అమ్మమ్మకు యిచ్చి—"

—ఏం ?

—వినిపించలా ?

—ఏమిటి ?

"నాకు తెలియదు బాబూ! అవిడకిస్తే వా డూరుకోడు....పనివేళప్పుడు—"

"ఆలాగైతే..."

"వాణ్ని చూడండి....ఉహూఁ అంటున్నాడు. వల్లకాదు...."

"ఉహూ....నేనూ అంటా వల్లకాదని...."

"మీ అమ్మమ్మ దగ్గర పోయి కూర్చుంటా!!"

# 3

"అమ్మాయ్! అదేమిటే? అలా మాటిమాటికీ తొట్టె కుదుపుతూంటే మళ్ళా మేలుకుంటున్నాడు! అసలే కొంటెకోణంగి. పోనీ, కాస్సేపు కాళ్ళమీద వేసుకుని చిచ్చిగొట్టు....అంత ఎగరేయకు, ఉలికిపడతాడు....ఒక్క పావుగంట ఆడించు. నేను మడివిడిచి ఇవతలకువచ్చి తీసుకుంటా—"

• • •

"ఇంకా, పడుకోలా వాడు?"

"ఉహుఁ. ష్. బిగ్గరగా అనకండి....ఇప్పుడే కాస్త కునుకుతున్నాడు....మళ్ళా లేస్తే నన్ను వేపుకుతింటాడు...."

"పీడాకడు....దొరికాడు...."

"..........."

"నిజంగానే వెన్నెల రాత్రుల్లో ఎంత హాయిగా ఉండేవాళ్ళం? ఇప్పుడు—"

"ఆఁ....మీకు ఎప్పుడూ అదే రంధి...."

"అవును....నా ఆనందానికి, అనుభవానికి అడ్డం గొట్టడానికి పుట్టాడు వీడు...."

"ఏమిటా మాటలు?—"

"ఏమిటా....నీతో మాట్లాడటానికైనా నాకు ఇప్పుడు స్వతంత్రంలేదు. బిగ్గరగా పిలువకూడదు. అబ్బాయి ఉలికిపడతాడు. బిగ్గరగా నడవకూడదు. ఆయన మేలుకుంటాడు. నీవు నాతో కాస్సేపు తీరికగా ఉండకూడదు. ఆ మహారాజాధిరాజు పోరు మొదలెడతాడు. ఐతే, నేను ఇక ఇంట్లోనూ ఉండకూడదు. అలాగైతే?"

"ఎక్కడ నేర్చుకున్నారు ఈ పాఠమంతా? మీకే ఉన్నారా మహా పిల్లలు? గాలికి తిరిగివచ్చి కబుర్లు చెప్పడానికే మీకు యింత కష్టమైతే, అస్తమానం కనిపెట్టుకుని కూర్చునేదానికి నాకు ఎలా ఉంటుంది?....ఐనా మన పిల్లవాడికి మనం చేసుకోవడం అబ్బురమా? ఒకరికి మెప్పా? వాడు మాత్రం అందరి పిల్లలలాగా విసిగిస్తాడా?"

"వెనక వేసుకు వస్తున్నావ్! అవును. నీకు వాడితోనే లోకం. నా మాట—"

"ఆ....మీ మాట....మీరు చెప్పే మాట ఏమిటో నాకు తెలుసు. కొత్తా?"

"ఊఁ....వీడి మూలానే నాకు నీవు దూరమౌతున్నావ్. ఐనావు. ఎందుకు పుట్టాలి....వీడు?"

*　　*　　*

"వింటున్నా మీ చిలుక పలుకులు. మహా లక్షణంగా ఉన్నాయ్...."

"కాదే అమ్మమ్మా!...."

"చూడండి! వాళ్ళ అబ్బాయితో యుద్ధం చేస్తున్నారు"

"అవును....వాడు ఎందుకు పుట్టాలి...."

"అలాగేం? నాగన్నా! నీవు ఎందుకు పుట్టావు?"

"మా అమ్మ కన్నది—"

"మీ అమ్మ కంటే మాత్రం, నువ్వు ఎందుకు పుట్టడానికి ఒప్పుకున్నావూ? నిన్ను కాకపోతే ఇంకొకడ్ని కనేది. కడుపుతూన్నమ్మ కనక మానుతుందా? వండుకున్నమ్మ తినక మానుతుందా?"

"ఏం—"

"............"

"జవాబు చెప్పవేం? ఇందాకనుంచీ నోరులేని పసికుంక—వాడిమీద ఎగిరావ్.... చెప్పు మరి?"

◆　　◆　　◆

"మీరూ....మీ వేషాలూనూ. ఎత్తుకో....ఓ మారు ఎత్తుకు తిప్పు. ఎందరు ఎత్తుకోంది ఇంత వాడవైనావ్? నేనూ బతికుంటే చూడకపోతానుటే? వాడూ రేపు ఈపాటికి బతికి బట్టకడితే వాడి పెళ్ళాం దగ్గిరా ఈలాగే ధీమాకులు చేస్తాడు. అప్పుడు మనవణ్ణి నీవే ఎత్తుకు మోయాలి. చాల్లేః—ఇక ఈలా తే....ఈ నిమిషానికే పండుతండ్రిని పిసిగేశావ్. ఈ కాలంవాళ్ళకు....ఏదీ తెలియదు. అదేం లోకమో! పోల్లే నాయనా! నీవు నా దగ్గిరే పడుకుందువుకాని. మీ అమ్మను నాయన్ని గంతు వేసుకోమను. ఇదుగోనే అమ్మాయి....! నవ్వొస్తే ఆపుకోవాలికాని—విరగబడుతూ, పరిగెత్తితే ఎలాగే? ఒక్కమారు వీణ్ణి తీసుకో—"